

రమణ రక్షకులు ఎవరు?

ఒంగోలు నగరంలోని ఎలైట్ మాల్‌లో రూ.2.34 కోట్లకుపైగా నగదు కాజేసిన ఎక్సైజ్ కానిస్టేబుల్ రమణ చౌదరి విషయంలో పోలీసులు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారు. - 8లో..



ష్.. చప్పుడు చేయొద్దు

ప్రజలకు ఇబ్బందులు కలిగించేలా రణగొణ ధ్వనులు చేసే సైలెన్సర్లను వినియోగిస్తే ఉపేక్షించేది లేదని ఎస్పీ ఏఆర్ దామోదర్ హెచ్చరించారు. - 8లో..

గరిష్టం/కనిష్టం
33.1/26.9

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఒకటి రెండు చోట్ల ఉరుములు మెరుపులతో జల్లులు పడవచ్చు.

న్యూస్‌రీల్

ఏకేయూను సందర్శించిన కలెక్టర్



యూనివర్సిటీ అధ్యాపకులతో మాట్లాడుతున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు సిటీ: ఆంధ్రకేసరి యూనివర్సిటీని కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా శుక్రవారం సందర్శించి ఉపకులపతి డి.వి.ఆర్.మూర్తి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బి.హరిబాబు నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. తొలిసారిగా ఏ.కే.యూనివర్సిటీకి వెళ్లిన కలెక్టర్‌కు ప్రొఫెసర్ బి.హరిబాబు, ప్రొఫెసర్ జి.రాజ మోహన్‌రావు ఘన స్వాగతం పలికారు. కలెక్టర్ తమీమ్ అన్సారియా వీసీ ఛాంబర్‌లో యూనివర్సిటీ పరిధిలోని వివిధ సెక్షన్ల అధిపతులు, యూనివర్సిటీ కళాశాల అధ్యాపకులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వీసీ, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ మాట్లాడుతూ యూనివర్సిటీ నిర్వహణ కోసం ప్రభుత్వం కేటాయించిన పేర్నమిట్ట ప్రాంగణంలో పనులు పూర్తి కాకపోవడంతో ప్రస్తుతానికి పెళ్లూరు కాలనీలోని పాత భవనాలను ఉపయోగించుకొని తరగతులు నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వం నుంచి నిధులు మంజూరైతే పనులు సకాలంలో పూర్తవుతాయన్నారు. ప్రస్తుతం ఆంధ్రకేసరి యూనివర్సిటీలో పరీక్షల నిర్వహణ విధి విధానాల గురించి వీసీ..కలెక్టర్ తమీమ్ అన్సారియా వివరించారు. ప్రస్తుతం యూనివర్సిటీలో 15 విభాగాలకు సంబంధించిన విద్యార్థులు ఉన్నత చదువులు కొనసాగిస్తున్నారని చెప్పారు. యూనివర్సిటీలో ఉన్న అన్ని విభాగాలను పరిశీలించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ నిర్మలామణి, డీన్ సీ.డి.సి.ప్రొఫెసర్ జి.సోమశేఖర్, సీఈ డాక్టర్ కే.వి.ఎస్.రాజు, డాక్టర్ బి.పద్మజ, డాక్టర్ మండే, హర్షప్రీతం దేవ్‌కుమార్, డాక్టర్ దేవీవర ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

హాస్టళ్లలో మౌలిక వసతులు కల్పించండి

- కలెక్టర్ తమీమ్ అన్సారియా



మాట్లాడుతున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు సిటీ: స్వీకార కార్యక్రమం కింద సంక్షేమ వసతి గృహాల్లో కనీస మౌలిక వసతుల కల్పనకు చేపట్టిన పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా అన్నారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయంలోని అధికారులతో శుక్రవారం సాయంత్రం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ తమీమ్ అన్సారియా మాట్లాడుతూ స్వీకార కార్యక్రమంలో భాగంగా సామాజిక బాధ్యతతో ముందుకు వచ్చి సంక్షేమ వసతి గృహాల్లో కనీస వసతులు కల్పించేందుకు వాటిని దత్తత తీసుకున్న సంబంధిత కార్పొరేట్ సంస్థల ప్రతినిధులను సమన్వయం చేసుకొని త్వరగా పనులు మొదలు పెట్టేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఆయా విషయాలను రోజువారీగా పర్యవేక్షించేందుకు నోడల్ అధికారిని నియమించాలని ఆదేశించారు. సంబంధిత శాఖల అధికారులు ఈ పనుల పురోగతిపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. కార్యక్రమంలో డీడీ లక్ష్మానాయక్, సీపీఓ వెంకటేశ్వరరావు, మత్స్యశాఖ జేడీ చంద్రశేఖర్, బీసీ వెల్ఫేర్ అధికారి అంజలి, జిల్లా ట్రైబల్ వెల్ఫేర్ అధికారి జగన్నాథరావు, మైనింగ్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

జిల్లా షూటింగ్ బాల్ స్త్రీ, పురుషుల జట్ల ఎంపిక



ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

సంతనూతలపాడు: జిల్లా షూటింగ్ బాల్ స్త్రీ, పురుష జట్లను మండలంలోని పేర్నమిట్ట జెడ్పీ హైస్కూల్‌లో శుక్రవారం ఎంపిక చేశారు. 12 మంది బాలికలు, 12 మంది బాలురని తుది జట్టుకింద ఎంపిక చేశారు. ఎంపిక ప్రక్రియను జిల్లా షూటింగ్ బాల్ సెక్రటరీ రత్నకుమార్ పర్యవేక్షించారు. ఎంపికైన విద్యార్థులను షూటింగ్ బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు కొల్లా నారాయణరావు, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వి.పార్వతి శాంతి, ఉపాధ్యాయులు అభినందించారు. వీరు అనంతపురం జిల్లా నార్పాలలో జరిగే 43 వ రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రకాశం జిల్లా జట్టు తరపున పాల్గొంటారని తెలిపారు.

గొంతు దిగని ముద్ద

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పేద బిడ్డల కడుపుపై కొట్టింది. నాణ్యమైన మెనూకు మంగళం పలికింది. బడిలో ఒక పూట నాణ్యమైన భోజనం తింటున్న ఆ బిడ్డలు ఇప్పుడు ఆకలి కేకలు వేస్తున్నారు. భోజన పథకానికి నిధులు నిలిపేసింది. ముక్కిన బియ్యం సరఫరా చేస్తోంది. భోజనం సరిగా లేకపోవడంతో ఇంటి నుంచి క్యారియర్లు తెచ్చుకుంటున్నారు. కూటమి ప్రభుత్వం నాణ్యమైన మద్యంపై పెట్టిన దృష్టి నాణ్యమైన విద్య, మెనూపై పెట్టలేదు. అమ్మకు వందనం పేరుతో తల్లులను దగాచేసిన ప్రభుత్వం చిన్నారుల కడుపు మాడుస్తోంది. పాఠశాలల్లో కనీస వసతులు మృగ్యమైపోయాయి. భవన నిర్మాణాలు మధ్యలోనే నిలిచిపోయాయి. ఇక మరుగుదొడ్ల పరిస్థితి అధ్వానంగా ఉంది. టాయిలెట్స్ క్లీనింగ్ రసాయనాలు నేటికీ పంపిణీ చేయలేదు. ప్రభుత్వ బడుల్లో విద్యార్థుల అవస్థలపై గ్రౌండ్ రిపోర్ట్..

- మెనూ నాణ్యతకు మంగళం
- చెత్తగా మధ్యాహ్న భోజనం
- ఇంటి నుంచి బాక్సులు తెచ్చుకుంటున్న విద్యార్థులు
- మధ్యాహ్న భోజన కార్మికులను వేధిస్తున్న కూటమి నేతలు
- ఆగిపోయిన నాడు–నేడు పనులు
- అధ్వానంగా మరుగుదొడ్లు
- పంపిణీకాని టాయిలెట్స్ క్లీనింగ్ రసాయనాలు



ఒంగోలు బండ్లమిట్ట హైస్కూల్లో ఇంటి నుంచి తెచ్చుకున్న భోజనం తింటున్న విద్యార్థినులు

జిల్లా వ్యాప్తంగా పాఠశాలలు	2326
మొత్తం విద్యార్థులు	1,73,314
శుక్రవారం హాజరైన విద్యార్థులు	99,931

సాక్షి గ్రౌండ్ రిపోర్ట్

సాక్షిప్రతినిధి, ఒంగోలు:

జిల్లా వ్యాప్తంగా 2326 ప్రాథిమిక, ప్రాథిమికోన్నత పాఠశాలలు ఉన్నాయి. ఇందులో మొత్తం 1,73,314 మంది విద్యార్థులు చదువుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సర్కార్ పాఠశాలలను పట్టించుకున్న పాపాన పోలేదు. దీంతో విద్యార్థులు పడుతున్న అవస్థలు వర్ణనాతీతం. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ పాఠశాలకు దీటుగా తీర్చిదిద్దింది. విద్యార్థులకు పౌష్టికాహారాన్ని అందించేందుకు చర్యలు చేపట్టింది. కానీ ప్రస్తుత ప్రభుత్వం స్కూళ్ల కనీస నిర్వహణను సైతం గాలికొదిలేసింది. నాడు–నేడు పనులను పక్కన పెట్టింది. దీంతో పాఠశాలల్లో అభివృద్ధి పనులు నిలిచిపోయాయి. తాము చదివే పాఠశాలల్లో కనీస వసతులు లేకపోవడంతో విద్యార్థులు పడుతూ లేస్తూ చదువుకుంటున్నారు. మధ్యాహ్న భోజనం నాణ్యత నాసిరకంగా ఉందని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నిబంధనలు ప్రకారం పాటించాల్సిన మెనూ అమలు చేయకపోవడంతో పలు పాఠశాలల్లోని అనేక మంది విద్యార్థులు ఇళ్ల నుంచి క్యారియర్‌లలో భోజనాలను తెచ్చుకోవడం గమనార్హం.

సర్దుబాటు అస్తవ్యస్తం..

ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియ కారణంగా దగ్గరలోనున్న ఉపాధ్యాయులను రేషనలైజేషన్ పేరుతో 50 కి.మీ నుంచి 100 కి.మీ దూరం పంపించినట్లు తెలుస్తోంది. దాని వలన కౌన్సెలింగ్‌లో వారు కోరుకున్న పాఠశాలను కాదని రేషనలైజేషన్ పేరుతో దూర ప్రాంతాలకు పంపించటంపై ఉపాధ్యాయులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా సుమారు 2 వేల మంది ఎస్జీటీ ఉపాధ్యాయులను అర్హతలను బట్టి వర్క్ సర్దుబాటు కింద హైస్కూల్ లో నియమించారు. సెకండరీ గ్రేడ్ పాఠశాలల్లో 1:30 నిష్పత్తి ప్రకారం ఎక్కువ మంది టీచర్లు ఉంటే వారిని హైస్కూల్ లో సబ్జెక్టు టీచర్లగా వర్క్ ఎడ్జస్ట్‌మెంట్ కింద పంపించారు. కరవది ఉన్నత పాఠశాల హైస్కూల్ ప్లస్‌గా మారింది. ఇందులో ఇంటర్ తరగతులు బోధిస్తున్నారు. ఈ పాఠశాలలో బైపీసీ, ఎంపీసీ ఉన్నా ల్యాబ్‌లు లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఇక గిద్దలూరు నియోజకవర్గాన్ని పరిశీలిస్తే 87 మంది ఉపాధ్యాయుల కొరత ఉంది.

రుచి తగ్గిన భోజనం..

విద్యార్థులకు గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం జగనన్న గోరుముద్ద ద్వారా నాణ్యమైన, రుచికరమైన భోజనం అందించింది. ఏటా మెనూలో మార్పులు తీసుకొచ్చి బలవర్థక ఆహారాన్ని అందించింది. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకంలో రుచి తగ్గిపోయింది. మెనూ ప్రకారం ఆహారం అందడంలేదు. నాసిరకం కోడి గుడ్లు ఇస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. స్కూళ్లలో మధ్యాహ్న భోజనం తయారు చేసే కార్మికులకు, ఏజెన్సీలకు సకాలంలో చెల్లింపులు చేయడం లేదు. సుమారు మూడు నెలల బిల్లులు పెండింగ్ ఉండబట్టే మధ్యాహ్న భోజన నాణ్యత రుచి కూడా తగ్గుతున్నట్లు విద్యార్థులే చెప్పడం గమనార్హం.

మధ్యాహ్న భోజన కార్మికులను వేధిస్తున్న టీడీపీ నాయకులు

జిల్లాలో మొత్తం 2,326 ఏజెన్సీలు ఉన్నాయి. వంట కార్మికులు, సహాయకులను కలుపుకొని 4,276 మంది పనులు చేస్తున్నారు. పారిశుధ్య కార్మికులు మరో 2,458 మంది ఉన్నారు. వాచ్‌మెన్‌లు 248 మంది ఉన్నారు. వీరిలో గత ఐదేళ్లుగా పని చేసే వారున్నారు. సుదీర్ఘకాలంగా 20 ఏళ్లకు పైబడి పని చేస్తున్న వారు కూడా ఉన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత జిల్లాలో మధ్యాహ్న భోజన పథకంలో పనిచేస్తున్న కార్మికులకులందరికీ కష్టాలు మొదలయ్యాయి. అరకొర వేతనాలతో బతుకు బండిని లాగుతున్న కార్మికులను తీసి వేసేందుకు ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయుల చేత ఒత్తిళ్లు చేశారు. స్వచ్ఛందంగా రాజీనామా చేయాలని బెదిరింపులకు దిగారు. నయానో భయానో బెదిరించి ఈ కార్మికుల్లో యాభై శాతం మందిని తొలగించారు. ముగ్గురు కార్మికులు కోర్టుకు వెళ్లి ఆర్డర్ తెచ్చుకోవడంతో వారిని కొనసాగిస్తున్నప్పటికీ ఒత్తిళ్లు చేయడం మాత్రం మానలేదు. విద్యా కమిటీలకు ఎంపికైన తెలుగు దేశం పార్టీ నాయకులు కొందరు వీరిని అసభ్య పదజాలంతో దూషించడం, భోజనం బాగా లేదంటూ ఫిర్యాదులు చేయడం లాంటి కుట్రలకు పాల్పడుతున్నారని కార్మికులు వాపోతున్నారు. భోజన నిర్వాహకులను మార్చేందుకు పెట్టిన శ్రద్ధ విద్యార్థులకు మంచి భోజనం పెట్టే దిశగా చర్యలు చేపట్టకపోవడం గమనార్హం.

అధ్వానంగా టాయ్‌లెట్లు..

ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్న టాయ్‌లెట్‌లను శుభ్రం చేసేందుకు ప్రభుత్వం ఇవ్వాల్సిన కెమికల్స్‌ను నూతన ప్రభుత్వం వచ్చిన తర్వాత ఇంత వరకు ఇవ్వకపోవడంతో దగ్గరలోనున్న బోరు వాటర్‌తోనే స్వీపర్‌లు శుభ్రం చేస్తున్నారు. దాని వలన మరుగుదొడ్ల నుంచి దుర్వాసనలు క్లాస్ రూములలోకి వస్తున్నట్లు విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. నాడు-నేడు కింద ఎంపికైన పాఠశాలల్లో నిర్మాణంలోనున్న పనులు మధ్యలోనే నిలిచిపోవడంతో ప్రభుత్వం అందించిన సిమెంట్, ఇతర వస్తువులు నిరుపయోగంగా ఉన్నాయి. ఆయా పాఠశాలలకు చెందిన విద్యార్థులకు వాటి వలన అసౌకర్యంగా ఉంది.

★ కొనకనమిట్ల మండలంలో మొత్తం 11 పాఠశాలల్లో నాడు–నేడు పథకం కింద నిధులు నిలిచిపోవడంతో అదనపు తరగతి గదుల నిర్మాణాలు ఆగిపోయాయి. గొట్లగట్టు జెడ్పీ స్కూల్, కాట్రగుంట, రేగడిపల్లి, పాతపాడు తదితర గ్రామాల్లోని పాఠశాలల్లో తరగతి గదుల నిర్మాణాలు నిలిచాయి.

★ పొదిలి మండలంలోని కాటూరివారిపాలెం, యానాదికాలనీ, కంభాలపాడు గ్రామాల్లో నిధులు లేకపోవడంతో నాడు– నేడు కింద జరగాల్సిన పాఠశాల భవనాల నిర్మాణాలు తాత్కాలికంగా నిలిచిపోయాయి.

★ తర్లుపాడు మండలంలో తర్లుపాడు, తుమ్మలచెరువు, మీర్జపేట తదితర గ్రామాల్లో 24 పాఠశాలలు ఉండగా 11 పాఠశాల భవనాలు పూర్తికాగా 7 స్కూళ్ల అదనపు తరగతి గదులు, మరో 6 పాఠశాలల్లో మౌలిక వసతుల నిర్మాణాలు పూర్తికావాల్సి ఉంది.

★ కొనకనమిట్ల మండలంలోని చిన్నారికట్ల జెడ్పీ ఉన్నత పాఠశాలలో 180 మంది విద్యార్థులు ఉన్నారు. సరైన టాయిలెట్స్ లేక అవస్థలు పడుతున్నారు. దీంతో పక్కనే ఉన్న మండల పరిషత్ జనరల్ పాఠశాలలో ఉన్న టాయిలెట్స్‌ను ఉపయోగిస్తున్నారు.

★ పొదిలి మండలంలో గతంలో మధ్యాహ్న భోజనం వండి రుచికరంగా పెడుతున్న నిర్వాహకులను తొలగించి కూటమి నేతలు తమకు నచ్చిన వారిని పెట్టుకున్నారు. దీనితో నాణ్యత కొరవడింది.

★ గిద్దలూరు నియోజకవర్గంలోని మధ్యాహ్న భోజనం వండే ఏజెన్సీలు 386 ఉండగా ఇప్పటికి 13 మందిని తొలగించారు. టాయిలెట్లు శుభ్రం చేసే ఆయాలు 324 మందిలో ఆరుగురిని తొలగించారు. టాయిలెట్స్ క్లీనింగ్ రసాయనాలు ఈ విద్యా సంవత్సరంలో నేటికీ పంపిణీ చేయలేదు. నీళ్లతోనే టాయిలెట్స్ క్లీన్ చేస్తున్నారు.

ఆరుబయటే మూత్ర విసర్జన

కొండపి నియోజకవర్గంలోని మర్రిపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు తగినన్ని మూత్ర, మల విసర్జన గదులు లేకపోవటంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పాఠశాలలో సుమారు 550 మంది విద్యార్థులు ఉన్నారు. సుమారు 30 మంది వరకు టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది ఉన్నారు. అయితే వీరికి కేవలం మూత్ర విసర్జనకు ఆరు, మల విసర్జనకు ఆరు, ఒకటి వికలాంగుల కోసం గదులు నిర్మించారు. వీటిలో ఒక దానిని మూత్ర విసర్జనకు ఉపాధ్యాయినిలు ప్రత్యేకంగా ఉపయోగిస్తున్నారు. అయితే పాతవి పాడైపోయి నిరుపయోగంగా ఉన్నాయి. దీంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఆరుబయట మూత్ర విసర్జన చేయాల్సిన దుస్థితి ఉంది. దీనికి తోడు బాత్‌రూమ్‌లు సరిగా శుభ్రం చేయకపోవటంతో అవి దుర్గంధం వెదజల్లుతున్నాయి.

ఇంటి నుంచే భోజనాలు..

సంతనూతలపాడు నియోజకవర్గంలో చీమకుర్తి, సంతనూతలపాడు, మద్దిపాడు, నాగులుప్పలపాడు మండలాల్లో ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు 280 ఉన్నాయి. ఆయా పాఠశాలల్లో సుమారు 15 వేల మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. భోజనాల నాణ్యత తగ్గిపోవడంతో విద్యార్థులు ఇంటి నుంచే బాక్కులు తెచ్చుకుంటున్నారు. గత ప్రభుత్వం హయాంలో రోజుకు 12 వేల నుంచి 14 వేల వరకు విద్యార్థులు మధ్యాహ్న భోజనాలు చేసేవారు. నాణ్యత లేకపోవడంతో స్కూళ్లలో తినేవారి సంఖ్య భారీగా తగ్గిపోయింది. ప్రస్తుతం 8 వేల మంది మాత్రమే తింటున్నారని తెలుస్తోంది. వాటికి తోడు వారానికి మూడు రోజులు అందించే చిక్కీలు సైజు తగ్గటం, ముక్కిపోయిన వాసనలు వస్తున్నాయనే ఆరోపణలు ఉన్నాయి. వారానికి 5 కోడిగుడ్లు ఇవ్వాల్సి ఉంటే గుడ్ల నాణ్యత బాగులేదనే ఆరోపణలు ఉన్నాయి.



నాసిరకంగా గుడ్లు

దర్శి నియోజకవర్గ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో గుడ్లు నాసిరకంగా వస్తున్నాయి. కొన్ని చోట్ల మురిగిన గుడ్లు కూడా వస్తుండటంతో వాటిని తినలేక పారేస్తున్నారు. మధ్యాహ్న భోజనం రుచికరంగా లేక కొందరు విద్యార్థులు ఇంటివద్ద నుంచి క్యారేజీలు తెచ్చుకుంటున్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన తరువాత మధ్యాహ్న భోజనం వండే వారిని బలవంతంగా తొలగించి కొత్తవారిని తీసుకున్నారు. వారు భోజనంలో నాణ్యత లేకుండా పెడుతున్నారు. అధికార పార్టీకి చెందిన వారు కావడంతో ఉపాధ్యాయులు కూడా వారిని ప్రశ్నించే సాహసం చేయలేకపోతున్నారు. విద్యార్థులు టాయిలెట్‌లకు కొన్ని చోట్ల తాళాలు వేశారు. విద్యార్థుల మరుగుదొడ్లు వాడిన చోట్ల శుభ్రంగా లేవు. దీంతో ఆ టాయిలెట్‌లను ఉపయోగించడం లేదు. మరి కొన్ని చోట్ల గత ప్రభుత్వం ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్‌లు మరమ్మతులకు గురయ్యాయి.



మార్కాపురం : తర్లుపాడులో నిలిచిపోయిన ఆది ఆంధ్ర పాఠశాల నిర్మాణ పనులు



నాగులుప్పలపాడు : క్యారేజీలను తెచ్చుకొని భోజనం చేస్తున్న విద్యార్థులు



చినారికట్ల జెడ్పీ పాఠశాలలో నిలిచిపోయిన మరుగుదొడ్లు

సర్దుబాటు చార్జీలు రద్దు చేయండి

- సీపీఎం జిల్లా కార్యదర్శి ఎస్‌డీ హనీఫ్
- పెంచిన విద్యుత్ చార్జీలకు నిరసనగా సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా



నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

ఒంగోలు సబర్బన్: విద్యుత్ సర్దుబాటు చార్జీలను వెంటనే రద్దు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎస్‌డీ హనీఫ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక రామ్ నగర్‌లోని విద్యుత్ భవన్ ముందు శుక్రవారం స్మార్ట్ మీటర్లు పెట్టవద్దని, పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించాలని కోరుతూ సీపీఎం ఒంగోలు నగర కమిటీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఒంగోలు విద్యుత్ భవన్ ఎస్‌ఈ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన నిరసన కార్యక్రమంలో టీడీపీ కూటమి ప్రభుత్వం విద్యుత్ చార్జీల పేరుతో వివిధ రకాలుగా దోచుకోవటాన్ని వారు తప్పుపట్టారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఎస్‌డీ హనీఫ్ మాట్లాడుతూ ఒకవైపు నిత్యవసర వస్తువులు ధరలు నింగినంటుతున్నాయని, మరోవైపు కరువు, వరదలు, వ్యాధులు వెంటాడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ స్థితిలో ప్రజలకు ఉపశమనం కలిగించకపోగా విద్యుత్ సర్దుబాటు చార్జీల పేరిట 2022–23 సంవత్సరానికి సంబంధించి రూ.8113 కోట్లు, 2023–24 కు సంబంధించి రూ.11 వేల కోట్ల పైగా భారాలు ప్రజలపై మోపుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వీటిని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఈఆర్సీ విద్యుత్ చార్జీలపై ప్రజల అభిప్రాయాన్ని స్వీకరిస్తోందని, ప్రజలు వ్యతిరేకించినా చార్జీలు విధిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతిపక్షంలో టీడీపీ ఉన్నప్పుడు బాదుడే బాదుడు కార్యక్రమాన్ని నిర్వహించారని, ప్రస్తుతం టీడీపీ కూటమి ప్రభుత్వం వచ్చాక ప్రజలపై భారాలు మొదలు పెట్టడం అత్యంత దుర్మార్గమన్నారు. విద్యుత్ రంగంలో ప్రజా వ్యతిరేక సంస్కరణల వలన ఈ భారాలు విధిస్తున్నారని మండిపడ్డారు. కార్పొరేట్ కంపెనీలు లాభ పడుతున్నాయని, ప్రజలు నష్టపోతున్నారన్నారు. ఈ విధానాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

ట్రూ అప్ చార్జీలు, సర్దుబాటు చార్జీలు వసూలు నిలిపేయాలని, సర్దుబాటు చార్జీల విధానం రద్దు కావాలని ప్రభుత్వాన్ని కోరారు. స్మార్ట్ మీటర్లు పెట్టరాదన్నారు. సీపీఎం ఒంగోలు నగర కార్యదర్శి జీ రమేష్ అధ్యక్షత వహించిన కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జీవీ కొండారెడ్డి, చీకటి శ్రీనివాసరావు, కంకణాల ఆంజనేయులు, జిల్లా కమిటీ సభ్యులు బాలకోటయ్య, బీ రఘురాం, కే రమాదేవి, జీ శ్రీనివాసులు, పీ కల్పన, నగర కార్యదర్శి వర్గ సభ్యులు దామా శ్రీనివాసులు, తంబి శ్రీనివాసులు, నగర కమిటీ సభ్యులు ఎస్కే హుస్సేన్, తంగిరాల మహేష్, బీవీ రావు తదితరులు పాల్గొన్నారు.

మద్యం బంకు !

- రోడ్డు పైనే మద్యం అమ్మకాలు

టంగుటూరు: టీడీపీ కూటమి ప్రభుత్వంలో మద్యాన్ని రోడ్డు పక్కనే బంకులో బహిరంగంగా విక్రయిస్తుండటం ప్రజలను విస్మయానికి గురిచేస్తోంది. ఇప్పటి వరకు కిళ్లీ బంకులు, టీ బంకులు చూశాం కానీ మొదటి సారిగా మద్యం బంకును చూస్తున్నామని ఇదెక్కడి వైపరీత్యమని అంటున్నారు. టంగుటూరులో షాపు నంబర్ 32 శ్రీరామ వైన్స్ పేరుతో టెండరు దక్కించుకున్నారు. వారు గతంలో ప్రభుత్వ మద్యం దుకాణం ఉన్న చోటే తమ వైన్ షాపు ఏర్పాటు చేసుకోవాలని తలచారు. అయితే గతంలో ఉన్న మద్యం స్టాక్‌ను తీసుకెళ్లకపోవడంతో శుక్రవారం దాని ముందు టెంట్ వేసి రోడ్డు పక్కన ఉన్న బంకులో పెట్టి మద్యం బహిరంగంగా విక్రయిస్తున్నారు.



రోడ్డు పైనే బంకులో పెట్టి మద్యం అమ్ముతున్న దృశ్యం

మద్యం కొట్టు.. టీ కొట్టు ఒక్కటేట!



మహిళలతో మాట్లాడుతున్న ఎస్సై టీ శ్రీరాం

- ఇళ్ల మధ్య మద్యం షాపును తీసేయండి
- కనిగిరిలో మహిళల నిరసన

కనిగిరి రూరల్: ఇళ్ల మధ్య మద్యం షాపు పెట్టొద్దంటే ''మద్యం కొట్టు కూడా టీకొట్టు లాంటిదే..వ్యాపారం జరిగే చోట పెట్టుకుంటాం'' అంటూ నిర్వాహకులు తమ అభ్యంతరాలు పట్టించుకోకుండా దుకాణం ఏర్పాటు చేశారంటూ కనిగిరిలో కేసిరెడ్డి నగర్ వీధి వైపు ఏర్పాటు చేసిన మద్యం దుకాణం వద్ద మహిళలు శుక్రవారం ఆందోళన వ్యక్తం చేశారు. సమాచారం అందుకున్న ఎస్సై టీ శ్రీరాం అక్కడకు చేరుకున్నారు. ఎస్సైతో మహిళలు తమ గోడు వెళ్లబోసుకున్నారు. నిబంధనలకు తూట్లు పొడిచి.. ఇష్టానుసారంగా గృహాల మధ్య మద్యం దుకాణం ఏర్పాటు చేశారన్నారు. ''మద్యం షాపు ప్రారంభానికి సిద్ధం చేస్తున్న ముందు రోజే అభ్యంతరం తెలిపాం. అయినా ఆపలేదు. టెంట్‌లు వేసి మరీ మద్యం విక్రయిస్తున్నారు. రెండ్రోజులుగా మహిళలు వీధిల్లో నుంచి ఇంటికి పోలేక పోతున్నాం. మహిళలు సాయంత్రం బజారు నుంచి ఇంటికి వెళ్లే పరిస్థితి లేదు. వీధి చివరనే మద్యం షాపు కావడంతో రోడ్డుపైనే కూర్చుని తాగుతున్నారు. రోడ్ల పైనే తప్ప తాగి.. ఒంటి మీద దుస్తులు కూడా లేకుండా పడిపోయారు. రోడ్డుకు అడ్డంగా బైక్‌లను పెట్టారు.. మేము ఇళ్లల్లో నుంచి ఎలా బయటకు రావాలి? సుమారు 100 ఇళ్లు కాలనీలో ఉన్నాయి. తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. ముందు మద్యం షాపు తీసి వేయించండి'' అంటూ మహిళలు విన్నవించారు. లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేస్తే దుకాణం తీసేసేందుకు చర్యలు తీసుకుంటామని ఎస్సై తెలిపారు. అప్పటి దాక మాకు రక్షణ ఇవ్వాలని మహిళలు అడగ్గా... ఆ ఏరియాల్లో పోలీసులను ఏర్పాటు చేసి డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహిస్తామని చెప్పారు.

క్లుప్తంగా

చోరీ కేసులో నిందితుడు అరెస్ట్

ముండ్లమూరు (దర్శి): ముండ్లమూరు మండలం మక్కెనవారిపాలెం గ్రామంలోని ఓ ఇంట్లో బీరువా పగులగొట్టి దొంగతనం చేసిన కేసులో నిందితుడిని అరెస్ట్ చేసినట్లు ఎస్సై నాగరాజు తెలిపారు. ఈ నెల 8వ తేదీ ముండ్లమూరు పోలీస్ స్టేషన్‌లో నమోదైన ఈ కేసులో పల్నాడు జిల్లా నూజెళ్ల మండలం కొండలరాయునిపాలెం గ్రామానికి చెందిన నిందితుడు గొల్లప్రోలు రామాంజనేయులును వేంపాడు వద్ద అరెస్ట్ చేసినట్లు చెప్పారు. అతన్ని విచారించగా మక్కెనవారి పాలెం గ్రామంలో దొంగతనం చేసింది తానేనని అంగీకరించాడని తెలిపారు. దొంగిలించిన సొత్తు రూ.50 వేలను అతని వద్ద నుంచి స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితుడిని కోర్టులో హాజరుపరచగా 14 రోజులు రిమాండ్ విధించారని ఎస్సై తెలిపారు.

ఎక్సైజ్ సీఐ డ్రైవర్ బైక్ చోరీ

కంభం: ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కార్యాలయం ఎదుట పార్క్ చేసి ఉన్న సిబ్బంది ద్విచక్రవాహనం అపహరణకు గురైంది. ఎక్సైజ్ సీఐ డ్రైవర్‌గా పనిచేస్తున్న కొండమీది నాగరాజు ద్విచక్రవాహనం రోజూమాదిరిగా స్టేషన్ ముందు నిలిపి ఉంచగా గురువారం అపహరణకు గురైంది. బైక్ చోరీ సంఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధితుడు తెలిపారు.

గుండ్లకమ్మలో వ్యక్తి గల్లంతు



గాలిస్తున్న ఫైర్ సిబ్బంది

మద్దిపాడు: మండలంలోని రాచవారిపాలెం గ్రామానికి చెందిన గంగిశెట్టి బ్రహ్మానాయుడు (30) గురువారం సాయంత్రం ఆ గ్రామ సమీపంలోని గుండ్లకమ్మ నదిలోకి తెప్పపై వెళ్లి ప్రమాదవశాత్తూ గల్లంతయ్యాడు. సమాచారం అందుకున్న స్థానిక తహసీల్దార్ సుజన్‌కుమార్ ఒంగోలు ఫైర్ డిపార్ట్‌మెంట్ వారికి, స్థానికంగా ఉన్న గజ ఈతగాళ్లకు, ఎన్‌డీఆర్‌ఎఫ్‌కు సమాచారం అందించారు. ఒంగోలు ఫైర్ సిబ్బంది గజ ఈతగాళ్లతో శుక్రవారం సాయంత్రం వరకూ గాలించినప్పటికీ ఆచూకీ లభించలేదు. అదే సమయంలో గుండ్లకమ్మ నదిలో వరద నీరు పెరిగిపోవడంతో రిజర్వాయర్ గేట్లు ఎత్తి నీటిని దిగువకు వదిలారు. దీంతోవె గాలింపు నిలిపివేశారు. గాలింపు కోసం ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాలు కూడా రానున్నట్లు సమాచారం. గల్లంతైన బ్రహ్మానాయుడికి భార్య, కుమార్తె ఉన్నారు.

దర్శి పీఆర్ డీఈఈ ఆదిశేషు మృతి



కె.ఆదిశేషు(ఫైల్)

కనిగిరి రూరల్: ఇటీవల కనిగిరి నుంచి దర్శికి బదిలీపై వెళ్లిన పీఆర్ డీఈఈ కారుమంచి ఆదిశేషు (60) శుక్రవారం రాత్రి గుండెపోటుతో మృతి చెందారు. ఈయన దర్శి నుంచి విధులు ముగించుకుని కారులో కనిగిరికి వస్తూ మార్గమధ్యంలో టుబాకో బోర్డు వద్ద గుండెపోటుతో కుప్పకూలారు. వెంటనే ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. పంచాయతీరాజ్ శాఖ డీఈఈ ఆదిశేషు కనిగిరి నియోజకవర్గంలో సుమారు 30 ఏళ్ల నుంచి బాధ్యతలు నిర్వహిస్తున్నారు. కనిగిరి, వెలిగండ్ల, పామూరు మండలాల ఏఈగా, కనిగిరి డీఈఈగా సేవలందించారు. ఆయన భౌతికకాయాన్ని పీడీసీసీబీ మాజీ చైర్మన్ వైఎం ప్రసాద్‌రెడ్డి, పీఆర్ ఉద్యోగులు, ఉద్యోగ సంఘాల నాయకులు సందర్శించి ఘన నివాళులర్పించారు. భౌతికకాయాన్ని ఆయన జన్మస్థలం గుంటూరుకు తరలించారు.

వర్షాలకు కూలిన పెంకుటిల్లు, బ్యారన్



కూలిన ఇంటిని పరిశీలిస్తున్న తహసీల్దార్ జితేంద్రకుమార్

బేస్తవారిపేట/కొనకనమిట్ల: భారీ వర్షాలకు మండలంలోని సోమవారిపేటలో కొంపల వెంకటరత్నం అనే వృద్ధురాలి పెంకుటిల్లు శుక్రవారం కూలిపోయింది. గత నాలుగు రోజులుగా పడుతున్న వర్షాలతో మట్టిగోడలు పూర్తిగా నానిపోయాయి. ఇంటి నుంచి వృద్ధురాలు బయటకు వెళ్లిన సమయంలో ఒక వైపున గోడ పూర్తిగా పడిపోయింది. సంఘటనా స్థలాన్ని తహసీల్దార్ జితేంద్రకుమార్, వీఆర్‌ఓ ఇంద్లా శేఖర్‌రెడ్డి పరిశీలించారు.

కొనకనమిట్ల మండలం రేగుమానిపల్లిలో గంటా రమణారెడ్డి, శ్రీనివాసరెడ్డికి చెందిన పొగాకు బ్యారన్ కూలిపోయింది. రేకులు, గోడలు పడిపోవటంతో సుమారు రూ.3 లక్షల వరకు నష్టం వాటిల్లినట్లు బాధిత రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.



రేగుమానిపల్లిలో కూలిన పొగాకు బ్యారన్

రమణ రక్షకులు ఎవరు?

- ఎలైట్ మాల్స్‌లో అక్రమాలకు పాల్పడిన ఎక్సైజ్ కానిస్టేబుల్‌పై కేసు నమోదు చేయని వైనం
- అతని వెనుకున్న ఎక్సైజ్ అధికారులపై జరగని విచారణ
- అసలు నిందితులను వదిలేసి దర్యాప్తు పేరుతో కాలయాపన
- ఆందోళనలో ఔట్ సోర్సింగ్ సిబ్బంది, వారి కుటుంబ సభ్యులు



ఎక్సైజ్ కార్యాలయంలో విచారణ సందర్భంగా నడుస్తున్న హైడ్రామా..

ఒంగోలు టౌన్: నగరంలోని ఎలైట్ మాల్స్‌లో రూ.2.34 కోట్లకుపైగా నగదు కాజేసిన ఎక్సైజ్ కానిస్టేబుల్ రమణచౌదరి విషయంలో పోలీసులు ఉదాసీనంగా వ్యవహరించడం పలు అనుమానాలకు తావిస్తోంది. మూడేళ్ల పాటు నిబంధనల ప్రకారం తనిఖీలు చేయకుండా కిందిస్థాయి ఉద్యోగి అవినీతిని పసిగట్టలేని స్థితిలో ఎక్సైజ్ శాఖాధికారులు ఉన్నారంటే నమ్మశక్యం కావడం లేదన్న వాదనలు వినిపిస్తున్నాయి. మాల్స్‌లో పనిచేసిన ఔట్ సోర్సింగ్ సిబ్బంది, వారి కుటుంబ సభ్యులు అడుగుతున్న ప్రశ్నలకు జవాబు చెప్పడానికి అధికారులెవరూ సుముఖంగా లేకపోవడం పలు విమర్శలకు తావిస్తోంది. మాల్స్‌లో కుంభకోణం వ్యవహారాన్ని మసిపూసి మారేడుకాయ చేసేందుకు అధికారులు ప్రయత్నాలు చేస్తుండటం స్పష్టంగా కనిపిస్తోంది. కానిస్టేబుల్ రమణ చౌదరి అవినీతి వ్యవహారం బయటకు పొక్కిన తర్వాత కూడా ఉన్నతాధికారులు అతడిని అదుపులోకి తీసుకునేందుకు ఎలాంటి చర్యలూ చేపట్టలేదు. ఇదంతా చాలా మామూలు వ్యవహారమే అన్నట్లు వారు ప్రవర్తిస్తున్నారు. ఇంటల్లుడిలా అతడికి సకల మర్యాదలు చేశారు. చివరకు పారిపోయేందుకు అవకాశం కల్పించారు. తీరా ఇప్పుడు కానిస్టేబుల్ రమణ పారిపోయాడని, అతడు దొరికితేగానీ ఏ విషయం తెలియదని బుకాయిస్తున్నారు. ఔట్ సోర్సింగ్ సిబ్బంది ఫిర్యాదును పూర్తిగా పరిగణలోకి తీసుకోలేమంటూ చేతులెత్తేస్తున్నారు. అయితే, ఒంగోలు ఆర్డీఓ లక్ష్మీప్రసన్నను విచారణ అధికారిగా జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ నియమించారు. శుక్రవారం అన్నవరప్పాడులోని ఎక్సైజ్ పోలీసు స్టేషన్‌లో ఆర్డీఓ విచారణ నిర్వహించారు. మాల్స్‌లో పనిచేస్తున్న సిబ్బందిని విచారించారు. ఆ సమయంలో మాల్స్ సిబ్బంది కుటుంబ సభ్యులు స్టేషన్ బయట పడిగాపులు కాస్తూ.. తమ బిడ్డలను కేసులో ఇరికించే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు.

సిబ్బందిని ఎందుకు అదుపులోకి తీసుకున్నట్లు..?

ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల ఫిర్యాదును ఆధారంగా చేసుకుని కేసు నమోదు చేయలేమని అటు ఎక్సైజ్ అధికారులు, ఇటు పోలీసులు చెబుతున్నారు. కానీ, ఫిర్యాదు చేసిన వారిని మాత్రం మూడు రోజుల క్రితమే అదుపులోకి తీసుకున్నారు. అరెస్టు చేసినట్లు చూపకుండానే విచారిస్తున్నారు. వారిని ఎక్కడుంచి విచారిస్తున్నారో వారి కుటుంబ సభ్యులకు కూడా చెప్పడం లేదు. దీనిపై కుటుంబ సభ్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఔట్‌సోర్సింగ్ సిబ్బంది ఇచ్చిన ఫిర్యాదును పరిగణలోకి తీసుకోలేమని చెబుతున్న అధికారులు.. వారిని ఎందుకు అదుపులోకి తీసుకున్నారో చెప్పాలని కుటుంబ సభ్యులు డిమాండ్ చేస్తున్నారు.

కానిస్టేబుల్‌పై కేసు నమోదు చేయకపోవడంపై అనుమానాలు

ఎలైట్ మాల్స్‌లో గోల్‌మాల్ వ్యవహారం బయటపడి మూడు రోజులు దాటింది. మాల్స్‌లో పనిచేసే సిబ్బంది ఎస్పీ ఏఆర్ దామోదర్‌కు ఫిర్యాదు చేయడంతో ఈ వ్యవహారం బయటపడింది. తాలూకా పోలీసుస్టేషన్‌కు ఎస్పీ రిఫర్ చేయగా, ఎక్సైజ్ కానిస్టేబుల్ చేతివాటం సంగతి వెలుగుచూసింది. మాల్స్‌లో పనిచేసే సిబ్బంది సైతం ఎక్సైజ్ కానిస్టేబుల్‌పైనే ఫిర్యాదు చేశారు. అయినప్పటికీ నేటికీ కేసు నమోదు చేయలేదు. పోనీ ఎక్సైజ్ శాఖ తరపున డిపో మేనేజర్ అయినా ప్రభుత్వ ఆదాయాన్ని కాజేసిన కానిస్టేబుల్ రమణపై కేసు పెట్టాలి. అదీ జరగలేదు. ఈ ప్రశ్నలన్నింటికీ జవాబు చెప్పడానికి ఎక్సైజ్ శాఖ సిద్ధంగా లేదు. ఎక్సైజ్ సూపరింటెండెంట్‌ను వివరణ అడిగినప్పుడల్లా నగరంలోని రెండు మాల్స్‌లో నగదు దుర్వినియోగం అయిందని, రోజువారీ విక్రయాలలో కొంత సరుకును స్కాన్ చేసి విక్రయించి ఆ నగదు మాత్రమే ప్రభుత్వానికి చెల్లించారని, మరికొంత సరుకును స్కాన్ చేయకుండా విక్రయించి జేబులో వేసుకున్నట్లు తేలిందని చెబుతున్నారు. మిగతా విషయాలు ఏమడిగినా విచారణ జరుగుతుందంటూ సమాధానం దాటవేస్తున్నారు.

రమణ.. దొరికేనా?

ఎక్సైజ్ కానిస్టేబుల్ రమణ పరారై మూడు రోజులవుతోంది. అతనిపై ఫిర్యాదు చేసిన ఔట్ సోర్సింగ్ సిబ్బంది మాత్రమే ఎక్సైజ్ పోలీసుల అదుపులో ఉన్నారు. కానిస్టేబుల్‌పై శాఖాపరంగా కూడా పోలీసులకు ఎలాంటి ఫిర్యాదూ చేయలేదు. ఫిర్యాదు చేయకుండానే రమణ కోసం పోలీసులు వెతికే పనిచేపడతారా అంటే.. లేదనే చెప్పాలి. మరి కానిస్టేబుల్ రమణ ఎప్పుడు దొరుకుతాడు.? ఔట్ సోర్సింగ్ సిబ్బంది ఇంకెన్ని రోజులపాటు ఎక్సైజ్ సిబ్బంది అదుపులో ఉండాలన్న ప్రశ్నలకు జవాబు లేదు.

రమణను కాపాడుతున్నట్లు జోరుగా ప్రచారం..

కానిస్టేబుల్ రమణను కాపాడేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు జోరుగా ప్రచారం జరుగుతోంది. మాల్స్‌లో మాయమైన డబ్బు రికవరీ చేసి కేసును నీరుగార్చేందుకే ఆయన మీద ఇప్పటి వరకు కేసు నమోదు చేయలేదని చెప్పుకుంటున్నారు. రమణకు అండగా అధికార పార్టీకి చెందిన కొందరు పెద్దలు రంగంలోకి దిగి తమవంతు ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం. ఈలోపు రమణ మీద కేసు ఎందుకు పెట్టలేదన్న ప్రశ్నలు ఉత్పన్నం కాకుండా కేసు నుంచి ప్రజల దృష్టి మరల్చేందుకే ఆర్డీఓ విచారణకు ఆదేశించినట్లు సిబ్బంది కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు.

ష్.. చప్పుడు చేయొద్దు!

- బైకర్లకు ఎస్పీ దామోదర్ హెచ్చరిక
- ఒంగోలులో 515 మాడిఫైడ్ సైలెన్సర్లు రోలర్‌తో ధ్వంసం



అద్దంకి బస్టాండ్ వద్ద రోలర్‌తో సైలెన్సర్లు ధ్వంసం చేయిస్తున్న ఎస్పీ

ఒంగోలు టౌన్: ప్రజలకు ఇబ్బంది కలిగించే విధంగా రణగొణ ధ్వనులతో కూడిన సైలెన్సర్లను వినియోగిస్తే ఉపేక్షించేది లేదని ఎస్పీ ఏఆర్ దామోదర్ బైకర్లను హెచ్చరించారు. విపరీతమైన ధ్వనితో నగర ప్రజలను భయకంపితులను చేస్తున్న మాడిఫైడ్ సైలెన్సర్లను శుక్రవారం ఒంగోలు నగరంలోని అద్దంకి బస్టాండ్ సెంటర్లో రోలర్‌తో ధ్వంసం చేశారు. ఇటీవల కాలంలో ఒంగోలు ట్రాఫిక్ పోలీసులు స్పెషల్ డ్రైవ్ చేపట్టి స్వాధీనం చేసుకున్న 515 సైలెన్సర్లను ధ్వంసం చేసినట్లు ఎస్పీ పేర్కొన్నారు. అలాగే నంబర్ ప్లేట్లు లేని వాహనాలు, నిబంధనలు అతిక్రమించి నంబర్ ప్లేట్లు ఏర్పాటు చేసుకున్న 1050 వాహనాలపై చట్టపరంగా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. మోటారు వాహనాల చట్టం నిబంధనలు ఉల్లంఘించినా, మాడిఫైడ్ సైలెన్సర్లు అమర్చుకున్నా భారీ జరిమానా తప్పదని హెచ్చరించారు. మాడిఫైడ్ సైలెన్సర్లు విక్రయించే దుకాణాల యజమానులు, వాటిని అమర్చే మెకానిక్‌ల మీద కూడా చట్టపరంగా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. భారీ శబ్దాల వల్ల గుండె జబ్బులు కలిగిన వృద్ధులు, మహిళలు, చిన్నారులు భయపడుతున్నారని చెప్పారు. కార్యక్రమంలో డీఎస్పీ రాయపాటి శ్రీనివాసరావు, ఎస్బీ సీఐ రాఘవేంద్ర, ట్రాఫిక్ సీఐ పాండు రంగారావు, తాలుకా సీఐ అజయ్ కుమార్, వన్‌టౌన్ సీఐ వై.నాగరాజు పాల్గొన్నారు.

భూసేకరణ పనులు పూర్తి చేయాలి

- అధికారులతో సమీక్షలో జేసీ గోపాలకృష్ణ



అధికారులతో సమీక్షిస్తున్న జేసీ

ఒంగోలు సిటీ: జిల్లాలోని జాతీయ రహదారులు, ప్రతిపాదిత రైల్వే మార్గాలకు సంబంధించి పెండింగ్ భూసేకరణ పనులు త్వరగా పూర్తి చేయాలని జేసీ ఆర్.గోపాలకృష్ణ ఆదేశించారు. భూసేకరణ అంశంపై శుక్రవారం కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. జేసీ మాట్లాడుతూ నడికుడి–శ్రీకాళహస్తి రైల్వే మార్గంతో పాటు 565, 544–డి, 216, 765, 167(బి)జాతీయ రహదారుల భూసేకరణపై ఆరా తీశారు. పునరావాసం, నష్టపరిహారం, కోర్టు కేసులపై ప్రత్యేక దృష్టి పెట్టి పరిష్కరించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో మార్కాపురం సబ్ కలెక్టర్ సహదిత్ వెంకట త్రివినాగ్, కందుకూరు సబ్ కలెక్టర్ శ్రీపూజ, కనిగిరి ఆర్డీఓ కేశవర్ధన్‌రెడ్డి, ఒంగోలు ఆర్డీఓ లక్ష్మీప్రసన్న, జాతీయ రహదారులు, రైల్వే శాఖ అధికారులు, తహసీల్దార్లు పాల్గొన్నారు.

నేటి నుంచి కేజీబీవీ అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన

ఒంగోలు సిటీ: కేజీబీవీల్లో ఖాళీగా ఉన్న బోధన, బోధనేతర పోస్టుల భర్తీకి సంబంధించి సబ్జెక్టు వారీగా షార్ట్‌లిస్ట్ చేసిన అభ్యర్థులకు(ప్రిన్సిపాల్, పీఈటీ, సీఆర్టీ) శనివారం, పీజీటీలకు(అకౌంట్స్, వార్డెన్లు) 20వ తేదీన ఉదయం 10 గంటలకు సర్టిఫికెట్ వెరిఫికేషన్ చేస్తున్నట్లు ఇన్‌చార్జ్ డీఈఓ సుబ్బారావు తెలిపారు. అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలని శుక్రవారం ఓ ప్రకటనలో స్పష్టం చేశారు.

భూగర్భ జలాల పెంపే లక్ష్యం

- కలెక్టర్ తమీమ్ అన్సారియా



మాట్లాడుతున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు సిటీ: భూగర్భ జలాలను అధికంగా వినియోగించిన గ్రామాలపై దృష్టి పెట్టి తిరిగి నీటి మట్టం పెరిగేలా చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా పేర్కొన్నారు. శుక్రవారం మార్కాపురం మండలంలోని నికరంపల్లిని మోడల్ గ్రామంగా ఎంపిక చేశామని, ఈ గ్రామంలో భూగర్భ నీటిమట్టం పెంచడానికి తీసుకోవాల్సిన చర్యలపై ప్రకాశం భవనంలోని తన చాంబర్‌లో సంబంధిత అధికారులతో ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. జిల్లాలో మొత్తం 57 గ్రామాలలో పరిమితికి మించి భూగర్భజలాలను వినియోగించినట్లు గుర్తించామని భూగర్భ జలవనరుల శాఖ డిప్యూటీ డైరెక్టర్ విద్యాసాగర్ కలెక్టర్‌కు వివరించారు. వీటిలో 14 గ్రామాల్లో రిలయన్స్ ఫౌండేషన్, సార్ప్స్, ఎఫర్డ్ సంస్థలు ఇప్పటికే అధ్యయనం చేసి వాటర్ బడ్జెట్ ప్రణాళికను రూపొందించాయని చెప్పారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. కేవలం భూగర్భ జలాలు పెంచడానికే పరిమితం కాకుండా స్థానిక నీటి వనరులను బట్టి సాగు చేయాల్సిన పంటలపై రైతులకు అవగాహన కూడా కల్పించాలన్నారు. వ్యవసాయ అనుబంధ రంగాల్లోనూ జీవనోపాధి పెరిగేలా ప్రణాళిక రూపొందించాలని ఆదేశించారు. ఈ నెల 23వ తేదీ నికరంపల్లిలో గ్రామ సభ నిర్వహణకు ఏర్పాటు చేయాలని చెప్పారు. సమీక్షలో డ్వామా పీడీ జోసఫ్‌కుమార్, ఏపీఎంఐపీ పీడీ పీవీ రమణ, జెడ్పీ సీఈఓ చిరంజీవి, డీపీఓ శ్రీనివాసరావు, జిల్లా ఉద్యానశాఖాధికారి గోపిచంద్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ డి.వెంకటరమణ, ఇరిగేషన్ అధికారులు, రిలయన్స్ ఫౌండేషన్ ప్రతినిధులు వెంకటబాబురావు, నవీన్, సార్ప్స్ ప్రతినిధి సునీల్ తదితరులు పాల్గొన్నారు.

ఓహో.. తప్పంతా జేసీబీలదేనా?



ఇసుక రీచ్ వద్ద రెవెన్యూ సిబ్బంది పట్టుకున్న



రెవెన్యూ అధికారులు వదిలేసిన జేసీబీ

- ఇసుక అక్రమ రవాణాలో జేసీబీలపై చర్యలతో సరిపుచ్చుతున్న అధికారులు

జరుగుమల్లి (సింగరాయకొండ): జరుగుమల్లి మండలంలో రెవెన్యూ అధికారులు వింతపోకడ అవలంబిస్తున్నారు. మండలంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఇసుక అక్రమ రవాణా జోరుగా సాగుతోంది. కానీ, రెవెన్యూ అధికారులు మాత్రం స్వామి భక్తి ప్రదర్శిస్తూ నామమాత్రపు తనిఖీలతో సరిపుచ్చుతూ కాలం గడుపుతున్నారు. జరుగుమల్లి మండల పరిధిలోని పాలేరులో నందనవనం గ్రామ ఒడ్డున జేసీబీలతో ఇసుక అక్రమ రవాణా జరుగుతోంది.. అడ్డుకోవాలని, అలాగే అక్రమ ఇసుక డంప్‌ను స్వాధీనం చేసుకోవాలని శుక్రవారం ఒంగోలు ఆర్డీఓ కె.లక్ష్మీప్రసన్న ఇచ్చిన ఆదేశాలతో తహసీల్దార్ బి.జనార్దన్ తన సిబ్బందితో ఇసుక రీచ్ వద్దకు వెళ్లారు. అక్కడ రెండు జేసీబీలు పనిచేస్తుండగా, ఒక దానిని మాత్రమే స్థానిక పోలీస్‌స్టేషన్‌కు తరలించి రెండో దానిపై మాత్రం జాలి చూపారు. అలాగే ఆ ప్రాంతంలో అక్రమంగా టీడీపీ సానుభూతిపరుడు నిల్వ ఉంచిన ఇసుక డంప్‌ను స్వాధీనం చేసుకున్నారు. పోలీస్‌స్టేషన్‌కు తరలించిన జేసీబీని సీజ్ చేశామని, జరిమానా విధించడం జరుగుతుందని తెలిపారు. కానీ, రెండో జేసీబీ గురించి మాత్రం ప్రస్తావించడం లేదు. అదేవిధంగా రాష్ట్ర ప్రభుత్వం ఇసుక రీచ్‌లకు అనుమతివ్వడానికి జీవో ప్రకారం అనేక నిబంధనలున్నాయి. జరుగుమల్లి ప్రాంతంలో ఇసుక రీచ్‌లు లేవని, ఎవరికీ అనుమతివ్వలేదని మైనింగ్ అధికారులు తెలియజేస్తున్నారు. కానీ, టీడీపీ సానుభూతిపరులు నందనవనం ఒడ్డున పాలేరులో ఇసుక రీచ్ నిర్వహిస్తూ ఒక ట్రాక్టర్‌కు లోడింగ్‌కు రూ.300, సీనరేజ్ కింద రూ.700 వసూలు చేస్తున్నారు. కానీ, రెవెన్యూ, పోలీస్, మైనింగ్ అధికారులు మాత్రం ఆవైపు కన్నెత్తి చూడటం లేదు. శుక్రవారం జేసీబీలు, ఇసుక డంప్‌ను సీజ్ చేసిన తహసీల్దార్ జనార్దన్.. అక్రమంగా ఇసుక రీచ్ నిర్వహిస్తున్న టీడీపీ సానుభూతిపరుడిపై ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంలో మతలబు ఏంటనే దానిపై విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రభుత్వ ఖజానాకు గండికొడుతున్న ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలని, జేసీబీలపై మాత్రమే కాకుండా అసలు మూలాలు, అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు హితవు పలుకుతున్నారు.

పుష్కరం పూర్తయినా సీటు వదలని కంభం ఏపీఓ!

కంభం: ఉపాధి హామీ విభాగంలో 12 ఏళ్లుగా ఒకే చోట విధులు నిర్వర్తిస్తున్న ఏపీఓపై కంభంలో జోరుగా చర్చ నడుస్తోంది. ఏపీఓ ఏడుకొండలు దాదాపు 2012లో కంభంలో బాధ్యతలు చేపట్టారు. టీడీపీ హయాంలో 2014 నుంచి 2019 వరకు, గత ప్రభుత్వంలో పూర్తి కాలం కొనసాగారు. నాలుగు నెలల క్రితం ఏర్పాటైన కూటమి ప్రభుత్వం.. ఇటీవల సాధారణ బదిలీలు చేపట్టినా కంభం ఏపీఓ మాత్రం తన సీటు వదల్లేదు. స్వార్థ ప్రయోజనాలతో పార్టీ కండువాలు మార్చేస్తున్న రాజకీయ నాయకుల పలుకుబడిని ఉపయోగించుకుని ఏపీఓ బదిలీ కాకుండా ఏళ్ల తరబడి ఇక్కడే కొనసాగుతున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. గతంలో ఉపాధి హామీ కూలీలకు గడ్డపారలు, ఇతర సామగ్రిని సక్రమంగా పంపిణీ చేయలేదన్న ఆరోపణలు కూడా ఏపీఓపై ఉన్నాయి. ఉన్నతాధికారులు ఇకనైనా స్పందించి ఏపీఓను బదిలీ చేస్తారో లేదో వేచి చూడాల్సిందే.

రోగులకు మెరుగైన వైద్యం అందించాలి

- ఒంగోలు మాతాశిశు వైద్యశాలను తనిఖీ చేసిన కలెక్టర్



మాతాశిశు వైద్యశాలను తనిఖీ చేస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు టౌన్: ఆస్పత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా ఆదేశించారు. శుక్రవారం స్థానిక మాతాశిశు వైద్యశాలను ఆకస్మికంగా ఆమె తనిఖీ చేశారు. ఆస్పత్రిలో రోగులకు అందుతున్న వైద్య సేవలను పరిశీలించి అక్కడున్న కొందరు రోగులతో మాట్లాడారు. వైద్యశాలలోని జనరల్ ఓపీ వార్డు, ఆపరేషన్ థియేటర్, నవజాత శిశువుల వార్డు, కాన్పుల వార్డు, స్టెరిలైజేషన్ గదులను పరిశీలించారు. ఆస్పత్రిలో రోగులకు అందిస్తున్న వైద్య సేవలు, సౌకర్యాల గురించి సూపరింటెండెంట్ డాక్టర్ సంధ్యను అడిగి తెలుసుకున్నారు. పారిశుధ్య, సెక్యూరిటీ సిబ్బంది రిజిష్టర్‌ను పరిశీలించి ఆస్పత్రిలో పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు.

విద్యుత్ అధికారుల ఆకస్మిక తనిఖీలు

- 36 బృందాలుగా ఏర్పడి ఒంగోలు నగరంలో తనిఖీలు
- రూ.13,37,400 అపరాధ రుసుం విధింపు

ఒంగోలు సబర్బన్: నగరంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ డీ–3 పరిధిలో శుక్రవారం విద్యుత్ అధికారులు ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. విద్యుత్ శాఖ విజిలెన్స్ ఈఈ టి.హైమావతి ఆధ్వర్యంలో ఈ దాడులు చేపట్టారు. 36 బృందాలుగా ఏర్పడి విద్యుత్ అధికారులు తనిఖీలు చేశారు. 2,224 సర్వీసులను తనిఖీ చేసి 290 మంది నుంచి అదనపు లోడు, మాల్ ప్రాక్టీస్, బ్యాక్ బిల్లింగ్ కేసులు నమోదు చేసి రూ.13,37,400 అపరాధ రుసుం విధించారు. ఈ సందర్భంగా విజిలెన్స్ ఈఈ టి.హైమావతి మాట్లాడుతూ విద్యుత్ చౌర్యం చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. 94408 12358, 8074140274 నంబర్లకు ఫోన్ చేసి విద్యుత్ చౌర్యంపై సమాచారం ఇవ్వాలని కోరారు. ఈ దాడుల్లో ఈఈ ఆపరేషన్స్ మాకినేని హరిబాబు, విజిలెన్స్ డీఈఈలు వి.శ్రీనివాసరావు, ఏ శ్రీనివాసరావు, కె.వెంకటేశ్వర్లు, టౌన్ డీఈఈ కేవీ పాండురంగారావు, రూరల్–2 డీఈఈ టి.శ్రీకాంత్, విజిలెన్స్ ఏఈఈ కోటేశ్వరరావు, ఆపరేషన్ ఏఈలు, సిబ్బంది పాల్గొన్నారు.

నల్లమల ఘాట్‌లో రోడ్డు ప్రమాదం

- గంటపాటు నిలిచిన వాహనాల రాకపోకలు



తీవ్రంగా దెబ్బతిన్న క్యాష్ వ్యాన్



హైడ్రాలిక్ జేసీబీ సహాయంతో



రోడ్డుకు అడ్డంగా ఉన్న ప్రమాదానికి గురైన వాహనాలు

పెద్దదోర్నాల: ఎదురెదురుగా వస్తున్న లోడు లారీ–బ్యాంక్ క్యాష్ వ్యాన్ ఢీకొనడంతో గంట పాటు నల్లమల ఘాట్ రోడ్డులో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఈ సంఘటన పెద్దదోర్నాల మండల పరిధిలోని కర్నూలు ఘాట్ రోడ్డులో మొట్లమల్లి కార్జునపురం–కొర్రప్రోలు గూడేల మధ్య శుక్రవారం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో రెండు వాహనాల డ్రైవర్లు స్వల్పంగా గాయపడటంతో మండల కేంద్రంలోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో ప్రథమ చికిత్స అందించారు. కోల్‌కతా నుంచి బళ్లారి వెళ్తున్న లోడు లారీ – కర్నూలు నుంచి శ్రీశైలం వెళ్తున్న బ్యాంక్ క్యాష్ వ్యాన్‌లు ఢీకొన్న ప్రాంతంలో రోడ్డుకు అడ్డంగా ఉండిపోయాయి. దాంతో గంటకు పైగా భారీ వాహనాల రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. కొంతమేర ఖాళీగా ఉండటంతో చిన్నచిన్న వాహనాలు మాత్రమే రాకపోకలు సాగించాయి. సమాచారం అందుకున్న ఎస్సై మహేష్ ఆదేశాలతో హైవే మొబైల్ టీం సంఘటన స్థలానికి చేరుకుని హైడ్రాలిక్ జేసీబీ సహాయంతో రోడ్డుకడ్డంగా ఉన్న వాహనాలను తొలగించి ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు. తుఫాన్ ప్రభావంతో నల్లమలలో కురుస్తున్న భారీ వర్షాలకు ట్రాఫిక్‌లో చిక్కుకున్న ప్రయాణికులు, వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. బ్యాంక్ క్యాష్ వ్యాన్‌లో ఎటువంటి నగదు లేకపోవడంతో పోలీసులు ఊపిరిపీల్చుకున్నారు.